పీవీపీ సిద్ధార్థలో జాతీయ స్థాయి పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శివాజీబాబు, అధ్యాపకులు

పెనమలూరు: స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల 19, 20 తేదీల్లో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీ బాబు అన్నారు. కాలేజీలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (ఎస్ఐహెచ్) విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ జాతీయ స్థాయిలో సాఫ్టువేర్, హార్డ్‌వేర్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తుందని చెప్పారు. దేశవ్యాప్తంగా 26 కేంద్ర మంత్రిత్వ శాఖలు, 6 రాష్ట్ర మంత్రిత్వ శాఖలు, 4 పరిశ్రమల భాగస్వామ్యంతో జరుగుతుందన్నారు. పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో నోడల్ కేంద్రంగా సాఫ్ట్‌వేర్ కేటగిరిలో 5 ఈవెంట్‌లో(థీమ్స్) నిర్వహించనున్నామని తెలిపారు. దీనిలో 27 అగ్రశ్రేణి జట్లు నుంచి 162 మంది పాల్గొని తమ నైపుణ్యం ప్రదర్శిస్తారని అన్నారు. ప్రతి ఈవెంట్‌లో గెలుపొందిన జట్టుకు రూ.లక్ష చొప్పున 5 జట్లకు రూ.5 లక్షలు బహుమతి ఉంటుందని తెలిపారు.19వ తేదీన పీఎం నరేంద్రమోదీ ఆన్‌లైన్‌లో విద్యార్థులతో మాట్లాడుతారని తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ సెంటర్ అధికారి డాక్టర్ పి.సాయికిరణ్, టెక్నికల్ హెడ్ డాక్టర్ జగదీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధినేత నిర్ణయమే శిరోధార్యం

ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే సింహాద్రి

బర్రంకుల(నాగాయలంక): రాబోయే ఎన్నికల్లో ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేస్తారనే అంశం తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంబంధించిన వ్యవహారమని, ఆయన నిర్ణయమే శిరోధార్యం తప్ప మా ప్రమేయం ఏమీ లేదని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు స్పష్టం చేశారు. ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక నిర్ణయంలో మా పార్టీలో సమస్యలు లేవని చెప్పారు. అలాంటి సమస్యలన్నీ అభ్యర్థులు దొరకని టీడీపీ, జనసేనకే ఉంటుందన్నారు. మండలంలోని గణపేశ్వరం శివారు బర్రంకుల వద్ద ఎంపీ నిధులు రూ.80 లక్షలతో మంగలేరు డ్రెయిన్‌పై చేపట్టనున్న వంతెన నిర్మాణ పనులకు శనివారం ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ తన ఫండ్స్ రూ.55 లక్షలు, మిగిలిన మొత్తం రూ.25 లక్షల నిధులను రిక్వెస్ట్‌తో సహచర ఎంపీల నుంచి తెచ్చి దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఈ వంతెన నిర్మాణం చేపట్టామని చెప్పారు. దిండి, గణపేశ్వరం, బర్రంకుల గ్రామాల ప్రజలకు, రైతులకు ఇది ప్రయోజనం కలిగిస్తుందని చెప్పారు. ఒక్క నాగాయలంక మండలంలోనే తన నిధులు రూ.కోటిన్నర వెచ్చించినట్లు వెల్లడించారు. సముద్ర తీర ప్రాంతం కాబట్టి ఉప్పునీటి ఊరక సమస్యతో ఈ ప్రాంతంలో పంటలు సక్రమంగా పండటం లేదని రైతులు తన దృష్టికి తెచ్చారన్నారు. దీనిపై సమగ్ర అధ్యయనం చేస్తున్నామని వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరక్టర్ మద్ది చిన్నారి, భోగాది శేషగిరి రావు, విజయవాడ సర్కిల్ ఇరిగేషన్ ఎస్ఈ టిజెహెచ్ ప్రసాద్, డ్రైనేజీ (గుడివాడ)ఈఈ వై.విజయలక్ష్మి, తహసీల్దార్ జె.విమలకుమారి, ఎంపీడీవో సీహెచ్. శ్రీనివాస్, సర్పంచ్ బెల్లంకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వంతెన నిర్మాణ పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ వల్లభనేని, ఎమ్మెల్యే రమేష్‌బాబు

వినికిడి యంత్రాలతో సాధారణ జీవితం

జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినికిడి యంత్రాల సహాయంతో ఆ లోపం ఉన్న వ్యక్తులు హాయిగా సాధారణ జీవితం గడపవచ్చని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. వినికిడి లోపం ఉందని కలత చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ రూ. 4.42 లక్షలతో సమకూర్చిన 13 జతల వినికిడి యంత్రాలను క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ మనిషి శరీరంలోని పంచేంద్రియాలలో అన్ని సమాన స్థాయిలో పనితీరు కనబరచకపోవడం జన్యుపరమైన లోపమే తప్ప శాపంగా చూడరాదన్నారు. విభిన్న ప్రతిభావంతులకు సామాజిక సేవా దృక్పథంతో మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సొసైటీ ద్వారా గతంలోనూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లాల్లో విభిన్న ప్రతిభావంతులకు కాలిపర్స్, ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు తదితరాలను ఉచితంగా అందజేశారన్నారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై స్పందించి అవసరమైన ఉపకరణాలను అందిస్తూ వారు హాయిగా జీవించేందుకు సహాయపడుతున్న సొసైటీ భవిష్యత్తులోనూ ఇదే తరహా సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా సొసైటీ అధ్యక్షులు వైఎస్‌జె మోజేష్, ఉపాధ్యక్షులు వై.ఐజాక్, కార్యదర్శి ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విభిన్నప్రతిభావంతులకు వినికిడి యంత్రాలు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

రేషన్ పొందని వారికి మరో అవకాశం

- ప్రతినెలా 17న గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పంపిణీ
- జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏదైనా కారణం చేత రేషన్ పొందని కార్డుదారుల కోసం ఇకపై ప్రతి నెలా 17 వ తేదీన సరుకులు పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా 17న మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎండీయూ వాహనం ద్వారా సంబంధిత వార్డు, గ్రామ సచివాలయం వద్ద కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ నెలకు సంబంధించి ఏ కారణం చేతనైనా రేషన్ తీసుకోని వారు సంబంధిత సచివాలయాల వద్ద రేషన్ పొందవచ్చన్నారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులందరికీ ఉచితంగా బియ్యం, సబ్సిడీ ధరలపై చక్కెర , కందిపప్పు, గోధుమపిండి ఇంటి వద్దనే పంపిణీ చేస్తున్నామన్నారు. అదనంగా కల్పించిన ఈ సౌకర్యాన్ని కార్డుదారులు వినియోగించుకోవాలని సూచించారు. ఎండీయూ ఆపరేటర్లు, వలంటీర్లు వారికి కేటాయించిన రైస్ కార్డుదారులందరికీ రేషన్ అందేలా తహసీల్దార్లు, సహాయ పౌరసరఫరాల అధికారులు, సివిల్ సప్లై డెప్యూటీ తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే 1967 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేయాలన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య



అశ్విని మృతదేహం

జగ్గయ్యపేట అర్బన్: రెండో వివాహం చేసుకొని 45 రోజులు అయి, కాపురానికి వచ్చిన 20 రోజుల్లోనే భర్త ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వివాహిత కర్రి అశ్విని (30) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలోని అలా సపురివారి వీధిలో శనివారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన కంభంపాటి సూర్యప్రకాష్ బేకరీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మొదటి భార్యతో పెళ్లయిన కొంతకాలానికి విడిపోయాడు. ఆ తరువాత గుంటూరుకు చెందిన కర్రి అశ్వినిని పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నాడు. అశ్వినికి కూడా మొదటి భర్త ద్వారా ఒక కుమార్తె ఉండగా, ఆమె తన అమ్మమ్మ వద్ద ఉంటుంది. మొదటి భర్త చనిపోవడంతో సూర్యప్రకాష్‌ను పెళ్లిచేసుకుంది. ఈ క్రమంలో శనివారం భర్త బేకరీకి వెళ్లిన సమయంలో ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొంది. మృతురాలి తల్లిదండ్రులు గుంటూరు నుంచి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఆనందకుమార్ కేసు నమోదు చేశారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



సత్యనారాయణ మృతదేహం

కంచికచర్ల : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ కిరాణా షాపు యజమాని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు.. హనుమాన్‌పేటకు చెందిన పబ్బతి సత్యనారాయణ (53) కిరాణా షాపు నడుపుతున్నాడు. అప్పులు తీర్చలేనేమోనని భయపడి పురుగుమందు తాగాడు. స్థానికులు వైద్య చికిత్స కోసం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గన్నవరం: జాతీయ రహదారి దాటుతున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి స్థానిక సినిమా హాల్ సెంటర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం ...గన్నవరానికి చెందిన సయ్యద్ నజీర్(43) సినిమా హాల్ సెంటర్‌లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి అగ్గిపెట్టె తీసుకువచ్చేందుకుగాను జాతీయ రహదారి దాటుతున్న సమయంలో ఏలూరు నుంచి విజయవాడ వైపుగా వేగంగా వెళ్తున్న వాహనం ఆతనిని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో నజీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్ తెలిపారు.

రేపు షష్ఠి వేడుకలు

విజయవాడ కల్చరల్: సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా కంచి కామకోటి పీఠ పాలిత లబ్బీపేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో కొలువై వున్న వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్య దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తునట్లు దేవాలయం మేనేజర్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధనుర్మాసం నేపథ్యంలో వెంకటేశ్వరస్వామికి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.